www.aksharadarbar.com
సోమవారం 13, ఆగస్టు 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :162 | పేజీలు : 04 | వెల : 05

సంక్షేమ హాస్టళ్లలో సోదాలు

- ఉదయం నుంచే ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- పెద్దాపూర్ గురుకులాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి..
- ఇటీవల మృతి చెందిన విద్యార్థి తల్లిదండ్రులకు పరామర్శ

04

రెడ్డి సాబ్ లిక్కర్ మాఫియాకు ఫుల్ ప్రొటెక్షన్

- కాటారంలో జోరుగా లిక్కర్ దందా
- సర్కారు ఆఫీసర్లకు రెడ్డి సాబ్ మంత్లీ గుడ్ వీల్
- సదరు ఆఫీసర్ల పర్యవేక్షణలోనే లిక్కర్ దందా..
- ఎక్సైజ్ కమిషనర్ నుంచి కానిస్టేబుల్ వరకు రెడ్డిసాబ్ కనుసన్నల్లోనే

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ డివిజన్ పరిధిలో లిక్కర్ మాఫియా డాన్ గా పిలువబడుతున్న హన్మకొండ ప్రాంతానికి చెందిన రెడ్డి సాబ్ దందాకు ఫుల్ ప్రొటెక్షన్ ఉంటుందట. లిక్కర్ దందాలో నిష్ణాతుడైన రెడ్డి సాబ్ రాష్ట్రస్థాయి నుండే లిక్కర్ దందాలో ఓ సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసుకోవడం విశేషం. ఈ దందాలో ఎక్సైజ్ కమిషనర్ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు రెడ్డి సాబ్ కనుసన్నుల్లోనే విధులు నిర్వహిస్తారని ఓపెన్ సీక్రెట్. ఇంకేముంది కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఫుల్ ప్రొటెక్షన్ నడుమ తన అక్రమ లిక్కర్ మాఫియాను కొనసాగిస్తూ రెడ్డి సాబ్ ఛాలెంజ్ విసురుతున్నాడు. ముఖ్యంగా కాటారం మండలకేంద్రంలో కొత్త బెల్ట్‌షాపులను ఓపెన్ చేయిస్తూ తన అక్రమ దందాలో కాటారం మండలాన్ని చిరునామాగా మారుస్తున్నాడు. ఇక కాటారం సామాన్య జనం మాత్రం తమ ఇళ్లను గుల్ల చేసుకుంటూ సంపాదించిన డబ్బును పూలల్లో పెట్టి మరీ బెల్ట్ షాపులకు అప్పగిస్తున్నారు. ఇంతలా కాటారం మండలంలో మద్యాన్ని ఏరులై పారిస్తుండగా అడ్డుకోవాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మాత్రం సర్వసాధారణంగానే జీహుజూర్ అంటూ సలాం కొడుతూ రెడ్డిసాబ్ పట్ల విధేయతను చాటుకుంటుండడం గమనార్హం. - అక్షర దర్బార్, కాటారం

03

ఏసీబీ వేట !

అవినీతి తిమింగళాలపై గురి !

- ఉన్నతాధికారులపై స్పెషల్ ఫోకస్
- అవినీతి నిరోధక శాఖ వలకు చిక్కుతున్న లంచగొండి ఆఫీసర్లు
- మొన్న పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత..
- నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్
- నిన్న మహబూబాబాద్ డీటీవో గౌస్ పాషా..
- పాలకుర్తి ఇరిగేషన్ ఏఈ గోపాల్
- నేడు రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి
- పక్కాగా ట్రాప్ చేసి పట్టుకుంటున్న వైనం
- వరుస ఘటనలతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- అవినీతి చేస్తే తప్పించుకోలేరంటూ ఏసీబీ డీజీ ఆనంద్ ట్వీట్

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరుస రైడ్స్‌తో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. లంచగొండి ఆఫీసర్లకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, రవాణా, రిజిస్ట్రేషన్లు, నీటిపారుదల, ట్రాన్స్‌కో, పశుసంవర్థకశాఖ ఇలా అన్ని డిపార్ట్‌మెంట్లపై ఏసీబీ ఫోకస్ పెంచింది. ముఖ్యంగా ఆయా శాఖల్లోని అవినీతి తిమింగళాలను వలపన్ని పట్టుకుంటోంది. ఇటీవల రాష్ట్రంలో పలువురు ఎస్సైలు, సీఐలు, ఏసీపీలు, సబ్ రిజిస్ట్రార్లు, డీటీవో, మున్సిపల్ సూపరింటెండెంట్‌తోపాటు తాజాగా రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కడం ఉద్యోగవర్గాల్లో కలకలం రేపుతోంది. రెండు రోజుల కింద నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ పెద్దఎత్తున నగదుతో ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ఆయన నివాసంలో స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ. 6 కోట్లకుపైనే ఉండటం చూసి అధికారులే షాక్ అయ్యారు. తాజాగా నేడు రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి రూ.8 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కొద్ది రోజుల వ్యవధిలోనే పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత, మహబూబాబాద్ ఇన్‌చార్జి డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ మహ్మద్ గౌస్ పాషా, పాలకుర్తి ఇరిగేషన్ ఏఈ గోపాల్ ఏసీబీకి పట్టుబడటం తీవ్ర చర్చనీయమైంది. ఈక్రమంలోనే అవినీతి అధికారులపై ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ మంగళవారం సంచలన ట్వీట్ చేశారు. అవినీతికి పాల్పడే అధికారులు ఏసీబీ నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. - అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి

02

పీఏసీఎస్ కార్యదర్శి సస్పెన్షన్

డీసీవో సంజీవరెడ్డి ఉత్తర్వులు

02

స్వాతంత్ర వేడుకల్లో పాల్గొనే అతిథులు వీరే

- 32 జిల్లాలకు ప్రకటించిన ప్రభుత్వం
- వరంగల్ లో మంత్రి పొంగులేటి
- హనుమకొండలో కొండా సురేఖ, జనగామలో ఐలయ్య
- ములుగులో మంత్రి సీతక్క, భూపాలపల్లిలో వీరయ్య

03

డీఎస్సీ కీ రిలీజ్..

వెబ్ సైట్‌లో అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు

20లోగా అభ్యంతరాలు తెలపాలన్న విద్యాశాఖ

02

రుణ విముక్తికి వేళాయే..

ఎల్లుండే మూడో విడత రైతు రుణమాఫీ..

03

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

ఏసీబీ వేట !

అవినీతి తిమింగళాలపై గురి !

- ఉన్నతాధికారులపై స్పెషల్ ఫోకస్
- అవినీతి నిరోధక శాఖ వలకు చిక్కుతున్న లంచగొండి ఆఫీసర్లు
- మొన్న పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత..
- నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్
- నిన్న మహబూబాబాద్ డీటీవో గౌస్ పాషా..
- పాలకుర్తి ఇరిగేషన్ ఏఈ గోపాల్
- నేడు రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి
- పక్కాగా ట్రాప్ చేసి పట్టుకుంటున్న వైనం
- వరుస ఘటనలతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- అవినీతి చేస్తే తప్పించుకోలేరంటూ ఏసీబీ డీజీ ఆనంద్ ట్వీట్

అక్షరదర్బార్ ప్రత్యేకప్రతినిధి: తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరుస రైడ్స్‌తో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. లంచగొండి ఆఫీసర్లకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, రవాణా, రిజిస్ట్రేషన్లు, నీటిపారుదల, ట్రాన్స్‌కో, పశుసంవర్ధకశాఖ ఇలా అన్ని డిపార్ట్‌మెంట్లపై ఏసీబీ ఫోకస్ పెంచింది. ముఖ్యంగా ఆయా శాఖల్లోని అవినీతి తిమింగళాలను వలపన్ని పట్టుకుంటోంది. ఇటీవల రాష్ట్రంలో పలువురు ఎస్సైలు, సీఐలు, ఏసీపీలు, సబ్ రిజిస్ట్రార్లు, డీటీవో, మున్సిపల్ సూపరింటెండెంట్‌తోపాటు తాజాగా రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కడం ఉద్యోగవర్గాల్లో కలకలం రేపుతోంది. రెండు రోజుల కింద నిజామాబాద్ మున్సిపల్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ పెద్దమొత్తున నగదుతో ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ఆయన నివాసంలో స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ. 6 కోట్లకుపైనే ఉండటం చూసి అధికారులే షాక్ అయ్యారు. తాజాగా నేడు రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి రూ.8 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కొద్ది రోజుల వ్యవధిలోనే పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత, మహబూబాబాద్ ఇన్‌చార్జి డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ మహ్మద్ గౌస్ పాషా, పాలకుర్తి ఇరిగేషన్ ఏఈ గోపాల్ ఏసీబీకి పట్టుబడటం తీవ్ర చర్చనీయమైంది. ఈక్రమంలోనే అవినీతి అధికారులపై ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ మంగళవారం సంచలన ట్వీట్ చేశారు. అవినీతికి పాల్పడే అధికారులు ఏసీబీ నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

- సబ్ రిజిస్ట్రార్ సునీత..

హనుమకొండ జిల్లా పరకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతనెల 25న ఏసీబీ ఆకస్మిక దాడులు చేసింది. పరకాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన లడే సాంబలక్ష్మి తన ఇరువురు కుమారులు లడే శ్రీనివాస్, శ్రీకాంత్ లకు మాదారం రెవెన్యూ పరిధిలో తన పేరున ఉన్న 9 గుంటల ఇంటి స్థలం గిఫ్టు రిజిస్ట్రేషన్ చేయించేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సంప్రదించింది. సబ్ రిజిస్ట్రార్ కే సునీత డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేష్ ద్వారా లంచం డిమాండ్ చేయడంతో సాంబలక్ష్మి కుమారుడు శ్రీనివాస్ నరేష్ కు నగదు అందిస్తుండగా ఏసీబి డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ప్రైవేటు వ్యక్తి ద్వారా సబ్ రిజిస్ట్రార్ సునీత పెద్దమొత్తంలో ప్రజల నుంచి డబ్బు గుంజుతున్నట్లు, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తగా సబ్ రిజిస్ట్రార్ సునీతను ఏసీబీ వలపన్ని పట్టుకోవడం చర్చనీయాంశమైంది.

అవినీతి అనకొండ నరేందర్..

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సూపరింటెండెంట్, రెవెన్యూ ఇన్‌చార్జి అధికారి దాసరి నరేందర్ నివాసంపై అవినీతి నిరోధక శాఖ శుక్రవారం దాడి చేసింది. నరేందర్ నివాసంలో సోదాలు చేయగా, ఇంట్లో దాచిన 2.93 కోట్ల నగదు, అతనితో పాటు భార్య, తల్లి కలిగి ఉన్న ఖాతాల్లో మొత్తం 1.10 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్‌ను కనుగొన్నారు. మంచం కింద ఉన్న అట్టపెట్టెల నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరు లక్షల విలువైన 51 తులాల (సుమారు 595 గ్రాములు) బంగారం, 1.98 కోట్ల విలువైన 17 స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 6.07 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు ప్రకటించారు. ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి అతనిపై నమోదైన కేసులో భాగంగా నిర్వహించిన ఈ దాడిలో ఆయనకు తెలిసిన ఆదాయ వనరులకు మించిన ఆస్తులు బయటపడ్డాయి.

- మానుకోట డీటీవో గౌస్ పాషా..

మహబూబాబాద్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్, ఇన్చార్జీ డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ మహ్మద్ గౌస్ పాషాను సోమవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. గత మే 28న మహబూబాబాద్ ఆర్టీవో ఆఫీస్ పై ముక్కుమ్మడిగా తనిఖీలు ఏసీబీ అధికారులు చేయగా డీటీవో దగ్గర పనిచేస్తున్న పర్సనల్ డ్రైవర్ మరో వ్యక్తి వద్ద రూ. 65 వేలతోపాటు సెల్ ఫోన్ దొరికింది. సెల్ ఫోన్ ఆధారంగా డీటీవో మహ్మద్ గౌస్ పాషా రూ. 2 కోట్ల 97 లక్షల 38 వేలు లావాదేవీలు జరిపినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతో మహబూబాబాద్ డీటీవో గౌస్ పాషా తోపాటు మరో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులను అరెస్ట్ చేసి వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

- ఇరిగేషన్ ఏఈ గోపాల్ ..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం గుడికుంటతండా స్పెషలాఫీసర్, ఇరిగేషన్ ఏఈ గోపాల్ రూ.6 వేలు లంచం తీసుకుంటూ నిన్న ఏసీబీకి పట్టుబడ్డాడు. తండాకు చెందిన బానోతు యాకు గతంలో రూ.1.27 లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేశారు. అయితే, ఆ డబ్బును తిరిగి పొందే క్రమంలో... అక్కడ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ గుగులోతు గోపాల్, కౌంటర్ సైన్ చేసేందుకు రూ.6 వేలు డిమాండ్ చేశాడు. ఏఈకి లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని యాకు... 9న ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చాడు. ఈమేరకు సోమవారం ఉదయం నక్కలగుట్టలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట బాధితుడు యాకు నుంచి డబ్బు తీసుకుంటుండగా గోపాల్‌ను పట్టుకున్నారు.

- రంగారెడ్డి జేసీ భూపాల్‌రెడ్డి..

రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) భూపాల్‌రెడ్డి మంగళవారం ఏసీబీకి చిక్కారు. ఆయనతో పాటు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపునకు జాయింట్ కలెక్టర్ రూ.8 లక్షల లంచం డిమాండ్ చేశారు. డబ్బును సీనియర్ అసిస్టెంట్ ద్వారా జేసీ తీసుకున్నారు. ఈక్రమంలో ఏసీబీ అధికారులు దాడి చేసి జేసీ, సీనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్నారు. మరోవైపు నాగోల్‌లోని జేసీ భూపాల్‌రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. ఇంటిలో రూ.16లక్షల నగదు, కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

- తప్పించుకోలేరు : సీవీ ఆనంద్

అవినీతికి పాల్పడే అధికారులపై తెలంగాణ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఎక్స్ (ట్విటర్)లో సంచలన ట్వీట్ చేశారు. లంచం తీసుకునే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. రంగారెడ్డి జాయింట్ కలెక్టర్, మరో ఉద్యోగి ఘటన ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ ఇద్దరినీ పట్టుకోవడంలో ఏసీబీ బృందం చాకచక్యంగా పనిచేసిందన్నారు. ఇద్దరి నుంచి రూ.ఎనిమిది లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని ఆనంద్ తెలిపారు.

పీఏసీఎస్ కార్యదర్శి సస్పెన్షన్

డీసీవో సంజీవరెడ్డి ఉత్తర్వులు

అక్షరదర్బార్, దుగ్గొండి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ విధానంలో అక్రమాలకు పాల్పడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల కార్యదర్శులు, ఇతర సిబ్బందిపై వేటుపడుతుంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పీఏసీఎస్ ల కార్యదర్శులు, ఇతర సిబ్బంది సస్పెన్షన్ కు గురయ్యారు. తాజాగా వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మందపల్లి పీఏసీఎస్ సెక్రటరీ కొంకటి రాజును సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి బి సంజీవరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దుగ్గొండి పీఏసీఎస్ సెక్రటరీ బిక్షపతికి అదనంగా మందపల్లి పీఏసీఎస్ కార్యదర్శి బాధ్యతలను అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే దానంపై కేసు

ప్రభుత్వ స్థలం ప్రహరీ కూల్చివేతను ప్రోత్సహించారని ఫిర్యాదు

జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఎఫ్ఐఆర్..

హైదరాబాద్, అక్షరదర్బార్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత దానం నాగేందర్‌పై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. ఆక్రమణదారులను కావాలని రెచ్చగొట్టారనే ఆరోపణలపై ఆయన మీద జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గత శనివారం జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో స్థానికులను రెచ్చకొట్టారని, దీంతో వారు.. ఆయన సమక్షంలోనే పార్క్ గోడను కూలగొట్టారని జీహెచ్ఎంసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. దీంతో దానంతో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఎస్సీ కీ రిలీజ్..

హైదరాబాద్, అక్షరదర్బార్ : తెలంగాణ రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ ప్రిలిమినరీ కీ విడుదలైంది. ప్రిలిమినరీ కీతో పాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌ను పాఠశాల విద్యాశాఖ అధికారులు వెబ్ సైట్ లో పెట్టారు. ఈ పరీక్షలు జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు జరిగాయి. ఒక వేళ అభ్యంతరాలుంటే ఈనెల 20 వరకు తెలిపేందుకు అవకాశం కల్పించారు. ఇక డీఎస్సీకి మొత్తం 2, 79, 967 దరఖాస్తులు రాగా, 2,45, 263 మంది (87.61 శాతం) హాజరయ్యారు. 34, 694 మంది గైర్హాజరయ్యారు.

రెడ్డి సాబ్ లిక్కర్ మాఫియాకు
ఫుల్ ప్రొటెక్షన్

- కాటారంలో జోరుగా లిక్కర్ దందా
- సర్కారు ఆఫీసర్లకు రెడ్డి సాబ్ మంత్లీ గుడ్ వీల్
- సదరు ఆఫీసర్ల పర్యవేక్షణలోనే లిక్కర్ దందా..
- ఎక్సైజ్ కమిషనర్ నుంచి కానిస్టేబుల్ వరకు రెడ్డిసాబ్ కనుసన్నల్లోనే

అక్షర దర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ డివిజన్ పరిధిలో లిక్కర్ మాఫియా డాన్ గా పిలువబడుతున్న హన్మకొండ ప్రాంతానికి చెందిన రెడ్డి సాబ్ దందాకు ఫుల్ ప్రొటెక్షన్ ఉంటుందట. లిక్కర్ దందాలో నిష్ణాతుడైన రెడ్డి సాబ్ రాష్ట్రస్థాయి నుండే లిక్కర్ దందాలో ఓ సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసుకోవడం విశేషం. ఈ దందాలో ఎక్సైజ్ కమిషనర్ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు రెడ్డి సాబ్ కనుసన్నుల్లోనే విధులు నిర్వహిస్తారని ఓపెన్ సీక్రెట్. ఇంకేముంది కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఫుల్ ప్రొటెక్షన్ నడుమ తన అక్రమ లిక్కర్ మాఫియాను కొనసాగిస్తూ రెడ్డి సాబ్ ఛాలెంజ్ విసురుతున్నాడు. ముఖ్యంగా కాటారం మండలకేంద్రంలో కొత్త బెల్ట్‌షాపులను ఓపెన్ చేయిస్తూ తన అక్రమ దందాలో కాటారం మండలాన్ని చిరునామాగా మారుస్తున్నాడు. ఇక కాటారం సామాన్య జనం మాత్రం తమ ఇళ్లను గుల్ల చేసుకుంటూ సంపాదించిన డబ్బును పూలల్లో పెట్టి మరీ బెల్ట్‌షాపులకు అప్పగిస్తున్నారు. ఇంతలా కాటారం మండలంలో మద్యాన్ని ఏరులై పారిస్తుండగా అడ్డుకోవాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మాత్రం సర్వసాధారణంగానే జీహుజూర్ అంటూ సలాం కొడుతూ రెడ్డిసాబ్ పట్ల విధేయతను చాటుకుంటుండడం గమనార్హం.

సర్కారు ఆఫీసర్లకు రెడ్డి సాబ్ మంత్లీ గుడ్‌విల్...

తన అక్రమ లిక్కర్ మాఫియాను సాఫీగా సాగించేందుకు గానూ రెడ్డిసాబ్ కాటారం మండలానికి సంబంధించిన లా అండ్ ఆర్డర్, లిక్కర్ సంబంధిత సర్కారు ఆఫీసర్లకు మంత్లీ గుడ్‌విల్ ఇస్తాడని సమాచారం.అంతేకాకుండా వాళ్లు అడిగినప్పుడల్లా బ్రాండెడ్ బాటిల్స్ ఇస్తూ పార్టీలు కూడా ఇవ్వడం రెడ్డిసాబ్‌కు పరిపాటే.అందుకు వాళ్లు చేయాల్సిన పని బెల్ట్‌షాపుల్లో లిక్కర్ విక్రయాలకు ఎలాంటి ఆటంకాలు కల్గకుండా చూసుకోవడమే. వీరితో పాటు లీడర్లు,కొందరు మీడియా పెద్దలకు సైతం నెలనెలా మామూళ్లతో పాటు బాటిల్స్‌ను అదనంగా ఇస్తూ తన దందాకు అడ్డుచెప్పకుండా మేనేజ్ చేసుకుంటాడని ఆరోపణలు ఉన్నాయి.ఇలా రెడ్డి సాబ్ తన అక్రమ లిక్కర్ మాఫియాలో అడ్డుచెప్పే వారందరినీ బాధ్యులుగా చేసి యథేచ్ఛగా లిక్కర్ సామాజ్యాన్ని ఇంతింతై వటుడింతై అన్నచందంగా మార్చుకుంటుండగా ప్రశ్నించేవారు కరువయ్యారని సామాన్య జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం వచ్చేనా...!

కాటారం మండలకేంద్రంలో బెల్ట్‌షాపులు మేడారం జాతరను తలపిస్తుండగా లిక్కర్ ప్రియులు నిలువు దోపిడికి గురవుతున్నారు.వైన్‌షాపు నుండి హోల్ సేల్‌గా మద్యాన్ని బెల్ట్‌షాపులకు విక్రయిస్తుండగా బెల్ట్‌షాపు నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు.ఇంత జరుగుతున్న పట్టించుకోవాల్సిన అధికారులను,ప్రజాప్రతినిధులను రెడ్డిసాబ్ మేనేజ్ చేసుకుంటున్న విషయం విధితమే.అయితే ఈ దందాను అరికట్టాలంటే ప్రజల్లో చైతన్యం రావాల్సిందేనని పలు ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా మహిళలు చైతన్యవంతులై బెల్ట్‌షాపుల దాష్టికాన్ని అరికట్టేలా నిరసనలు తెలిపితేనే సమస్యకు పరిష్కారం అవుతుందని అంతవరకు రెడ్డిసాబ్ ధన బలాన్ని తట్టుకోవటం ఎవరితనం కాదని పలు సంఘాల నాయకులు చెబుతున్నారు.రాబోయే రోజుల్లో లిక్కర్ మాఫియాపై ఎలాంటి చర్యలుంటాయో వేచి చూడాలి..

రుణ విముక్తికి వేళాయే..

- ఎల్లుండే మూడో విడత రైతు రుణమాఫీ..
- ఆగస్టు 15న ఖమ్మం జిల్లా వైరాలో సీఎం రేవంత్ సభ
- రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రైతుల ఖాతాల్లో జమ

హైదరాబాద్, అక్షరదర్బార్ : తెలంగాణ రైతులకు శుభవార్త.. ఎల్లుండే మూడో విడత రుణ మాఫీ కానుంది. ఆగస్ట్ 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకు నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసి చూపించారు. 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తలను చేసేందుకు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పింది. జులై 15వ తేదీన రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం.. మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టింది. జులై 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రుణమాఫీ చేసింది. 11,14,412 మంది రైతులకు రూ.6034.97 కోట్లు విడుదల చేసింది. ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మూడో విడత పంట రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. అమెరికా పర్యటన నుంచి వచ్చీ రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా వైరా మండలంలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తారు. ఆ రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయనున్నారు. దీంతో రుణమాఫీలో కీలక ఘట్టం ముగియనుంది.

స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అతిథులు వీరే

- 32 జిల్లాలకు ప్రకటించిన ప్రభుత్వం
- వరంగల్ లో మంత్రి పొంగులేటి
- హనుమకొండలో కొండా సురేఖ, జనగామలో ఐలయ్య
- ములుగులో మంత్రి సీతక్క భూపాలపల్లిలో వీరయ్య

అక్షర దర్బార్, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 15న ఆయా జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే ముఖ్య అతిథుల జాబితాను ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది. హైదరాబాద్ లో ప్రభుత్వ సలహాదారు మహమ్మ ద్ అలీ షబ్బీర్, భద్రాద్రి కొత్తగూడెంలో మంత్రి తుమ్మ ల నాగేశ్వరరావు, హనుమకొండలో మంత్రి కొండా సురేఖ, జగిత్యాలలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, భూపాలపల్లిలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్య, జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, గద్వాలలో ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, కామారెడ్డిలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కరీంనగర్ లో మంత్రి శ్రీధర్ బాబు, ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఆసిఫాబాద్ లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మహబూబాబాద్ లో ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, మహబూబ్ నగర్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు, మంచిర్యాలలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, మెదక్ లో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, మేడ్చల్ లో ఎమ్మె ల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ములుగులో మంత్రి సీతక్క, నాగర్ కర్నూల్ లో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి, నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణపేటలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్ గురునాథ్ రెడ్డి, నిర్మల్ లో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నిజామాబాద్ లో మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్పర్సన్ ఈ అనిల్, పెద్దపల్లిలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ శారద, రాజన్న సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రంగారెడ్డిలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహ, సిద్దిపేటలో మంత్రి పొన్నం ప్రభాకర్, సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వికారాబాద్ లో శాసనసభ స్పీకర్ జి ప్రసాద్ కుమార్, వనపర్తిలో ఎస్సీ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, భువనగిరిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ప్రకటించారు.

స్వగ్రామానికి సేవ అభినందనీయం

ఉప్పరపల్లి హైస్కూల్ హెచ్ఎం విజయ సుశీల

అక్షర దర్బార్, కేసముద్రం : ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా తన సొంత గ్రామాన్ని మరవకుండా సామాజిక సేవ చేయడం అభినందనీయమని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ సుశీల అన్నారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామానికి చెందిన హైదరాబాద్ అసిస్టెంట్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్) ఎసల్ల అప్పయ్య తన సొంత ఖర్చులతో రూ.30 వేల విలువైన టై, బెల్టు, బ్యాడ్జీ, ఐడీ కార్డు, షూ లను తండ్రి కట్టయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయ సుశీల మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సహాయం అందించడం హర్షనీయమని అన్నారు. విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించిన ఏసిఎఫ్ ఎసల్ల అప్పయ్యా ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సోదాలు

- ఉదయం నుంచే ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- పెద్దాపూర్ గురుకులాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి..
- ఇటీవల మృతి చెందిన విద్యార్థి తల్లిదండ్రులకు పరామర్శ

హైదరాబాద్, అక్షరదర్బార్: హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ హాస్టళ్లలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లోని బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచే అధికారులు తనిఖీలు చేశారు. హాస్టళ్లలో ఆహారం సహా సౌకర్యాలు తదితర విషయాలపై ఆకస్మిక సోదాలు చేశారు. ఆయా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాల తీరును పరిశీలించారు. కొంతకాలంగా ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్న ఫిర్యాదులు రావడంతో ఈ దాడులు చేసినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో కుళ్లిన పదార్థాలతో ఆహారం వండుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా గతకొన్ని రోజులుగా వసతి గృహాల్లోని విద్యార్థులు తరచూ

అనారోగ్యానికి గురవుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి తీవ్ర కడుపునొప్పితో చనిపోయిన విషయం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఏసీబీ అధికారులు ప్రభుత్వ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

పెద్దాపూర్ పాఠశాలను పరిశీలించిన భట్టి..

జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలించారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించారు. పిల్లలే తమ భవిష్యత్తుగా భావిస్తున్న కుటుంబాలకు వారు లేని లోటును పూడ్చలేమన్న భట్టి, వారి బాధలను మాత్రం అర్థం చేసుకుంటామని తెలిపారు. ఆ రెండు కుటుంబాలకు గురుకుల సొసైటీ పరిధిలో వారి అర్హత ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు గురుకుల పాఠశాల హాస్టల్ పరిసరాలను భట్టి పరిశీలించారు. జరిగిన ఘటనపై ప్రిన్సిపల్‌తో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పాము కాటు వల్ల విద్యార్థి చనిపోయాడని భావిస్తున్న దృష్ట్యా అలాంటి ఘటన జరిగితే క్షణాల్లో వైద్యం అందించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల గురుకులాల్లో యాంటి వీనమ్, రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సంతోషకరం : కేటీఆర్

మరోవైపు ఉపముఖ్యమంత్రి గురుకుల పాఠశాలను సందర్శించడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. గురుకుల స్కూళ్ల సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం సంతోషకరమని తెలిపారు. గురుకులాల్లో అంతా బాగానే ఉందన్న భావనతో కాంగ్రెస్ సర్కారు ఉందని, తమ ప్రయత్నంతో కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొవడం సంతోషకరమని కేటీఆర్ పేర్కొన్నారు.

బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా కర్ణాకర్..

అక్షర దర్బార్, కేసముద్రం : భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా కార్యదర్శిగా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఎలబోయిన కర్ణాకర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కేసముద్రం మండల కేంద్రంలో పత్రిక విలేకరులతో మాట్లాడారు. పార్టీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ కు, యువమోర్చా జిల్లా అధ్యక్షులకు, మండల నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి కోసం కన్న తండ్రిపై దాడి
భూపాలపల్లిలో ఘటన

అక్షర దర్బార్, భూపాలపల్లి: ఆస్తి కోసం కన్నతండ్రిపై చిన్న కూతురు, దత్తత తీసుకున్న అల్లుడు దాడి చేయించిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలో చోటు చేసుకుంది. కారల్ మార్క్స్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు వేల్పుల మల్లేష్ ను అతని చిన్న కూతురు మహేశ్వరి, దత్తత తీసుకున్న అల్లుడు లక్ష్మా రెడ్డి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మల్లేష్ పై దాడి చేయించారు. ఈ ఘటనలో అతని రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికుల సమాచారంతో 108 లో వేల్పుల మల్లేష్ ను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తన తండ్రిపై చెల్లి మహేశ్వరి, లక్ష్మా రెడ్డి దాడి చేశారని వేల్పుల మల్లేష్ పెద్ద అల్లుడు జగన్మోహన్ రెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా భూపాలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద బీమా దరఖాస్తు గడువు పొడగింపు

అక్షర దర్బార్, తొర్రూరు: ఈ–శ్రమ్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రమాద బీమా దరఖాస్తు గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు తొర్రూరు సహాయ కార్మిక అధికారి బి. రవి తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో ప్రమాద బీమా దరఖాస్తు వివరాలు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వెల్లడించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వ పథకంలో (31 మార్చి 2022 వరకు) నమోదైన అసంఘటిత రంగ కార్మికులు కేంద్ర ప్రభుత్వ ప్రమాద భీమా దరఖాస్తులు తొర్రూరులోని కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులు మరణించినా, శాశ్వత వైకల్యం చెందినా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రమాద భీమా అందుతుందన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షలు, శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ.1లక్ష ఎక్స్ గ్రేషియా అందుతుందన్నారు. అసంఘటిత రంగ కార్మికులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్వో వితరణ

అక్షర దర్బార్, మల్హర్ : గజాడి సడవలి జ్ఞాపకార్థంగా తాను 12 సంవత్సరాలు పనిచేసిన పాఠశాలకు విద్యార్థుల తాగునీటి అవసరాల నిమిత్తం 15 వేల రూపాయలు విలువగల ఆర్వోను ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల తాడిచెర్లకు అందజేశారు. మహేష్ సార్ సేవలను కొనియాడుతూ పాఠశాల హెచ్ఎం సదానందం సార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థికి ఐడి కార్డ్ ,బెల్ట్ కూడా వితరణ చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్ బాబు, జడ్.పి.హెచ్.ఎస్ తాడిచర్ల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు భాస్కర్ రావు, రామారావు పల్లి HM పద్మ రుద్రారం ఉపాధ్యాయులు సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు అరుణ్ కుమార్ కవిత, సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా...

- ప్రమాదకరంగా ఎండిన వృక్షాలు
- పట్టించుకోని అధికారులు

అక్షర దర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం–మంథని వైపు గల ప్రధాన రహదారికి ఆనుకుని ఎండిన ఓ రెండు మహా వృక్షాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ఆ వైపుగా ప్రయాణిస్తుండగా ఎండిన వృక్షాలు ప్రధాన రహదారి వైపుకే ఆనుకుని ఊగుతూ కనిపిస్తున్నాయి. అసలే వర్షాకాలం ఆపై ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నందున రోడ్డుపై పడేలా ప్రమాదకరంగా ఊగుతున్నాయి. దీంతో ఆవైపు ప్రయాణించే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. మరీ ముఖ్యంగా ద్విచక్ర వాహనాదారులైతే ఎప్పుడూ మీద పడుతుందోనని భయానికి గురవుతూ నెమ్మదిగా ఆగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. గత కొన్ని నెలల నుండి ఎండిన వృక్షాలు కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా అని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని శాఖల అధికారులు తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారే తప్పా ఎవరూ పట్టించుకోడం లేదని ఆరోపించారు. ప్రాణ నష్టం జరగక ముందే కాటారం, ధన్వాడ గ్రామాల సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న ఎండిన వృక్షాలను తొలగించేలా అధికారులు కృషి చేయాలని ద్విచక్రవాహనాదారులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వాటా ఇవ్వాలి

అక్షర దర్బార్, భూపాలపల్లి: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వార్షిక ఉత్పత్తి లో వచ్చే లాభాల్లో వాటా ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (IFTU) డిమాండ్‌చేసింది. ఈమేరకు నాయకులు మంగళవారం భూపాలపల్లి జీఎం అభి భూ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. సింగరేణి లో అతి తక్కువ వేతనాలతో ఎక్కువ శ్రమ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం వార్షిక ఉత్పత్తిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను గుర్తించి లాభాల వాటా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టీ యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు బందు అశోక్, రాష్ట్ర నాయకులు ఈ నరేష్, తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ చంద్రగిరి శంకర్,, రమేష్, సమ్మక్క తదితరులు ఉన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగ్

అక్షర దర్బార్, మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లలో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ్ ర్యాలీని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ. రాష్ట్ర మంత్రి కిషన్ రెడ్డి. భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి, చంద్రుపట్ల సునీల్ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు మంగళవారం ర్యాలీని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఇంటి ఇంటికి వితరణ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్ రావు, మండల అధ్యక్షులు ముడితనపెల్లి ప్రభాకర్, అధికార ప్రతినిధి చొప్పరి రాజు, నాయకులు నూతి నరేష్, మల్లెవేణి రమేష్ , గాదనవేన రాజయ్య, షేక్ నిషాన్, చిగురు సంజీవ్, ఐలపురం సందీప్, తూండ్ల రాజయ్య, రాజగట్టు, తదితరులు పాల్గొన్నారు.